## క్లుప్తంగా

### వరద బాధితులకు ఎస్‌డీఆర్ స్కూల్ విరాళం



కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): వరద బాధితుల సహాయార్థం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.2 లక్షలు విరాళం అందజేసినట్లు ఎస్‌డీఆర్ విద్యాసంస్థల అధినేత కొండారెడ్డి గురువారం తెలిపారు. విజయవాడ వరద బాధితుల కోసం రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్‌కు రూ.లక్ష అందజేయగా, ఎస్‌డీఆర్ స్కూల్ విద్యార్థులంతా కలిసి కలెక్టర్ రాజకుమారికి మరో రూ.లక్ష అందజేసినట్లు తెలిపారు. దీంతో విద్యాసంస్థల చైర్మన్ కొండారెడ్డిని, విద్యార్థులను కలెక్టర్ అభినందించారు.

### వరద బాధితులకు విద్యార్థుల విరాళం



కలెక్టర్‌కు నగదును అందజేస్తున్న బోడెమ్మనూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు

ఉయ్యాలవాడ: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు మేము సైతం అంటూ మండలంలోని బోడెమ్మనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముందుకు వచ్చారు. పాఠశాల విద్యార్థులంతా కలిసి రూ.11,000 నగదును సేకరించారు. ఈ మొత్తాన్ని ప్రధానోపాధ్యాయుడు విప్రనారాయణచారి, పీడీ దాసుతో కలిసి గురువారం సాయంత్రం నంద్యాలలో కలెక్టర్ రాజకుమారికి అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను, పాఠశాల సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.

### వ్యక్తి మృతి

శిరివెళ్ల: చెన్నూరులో గురువారం రాత్రి బండారు సుబ్బరాయుడు (54) అనే వ్యక్తి మృతి చెందాడని ఎస్‌ఐ చిన్న పీరయ్య తెలిపారు. ఇతను పొలం పక్కన మరో వ్యక్తి తన పొలంలో నీటి గుంత తవ్వుతున్న విషయంపై ఇరువురి మధ్య ఘర్షణ జరిగిందన్నారు. ఈ ఘటనలో సుబ్బరాయుడు మరణించాడన్నారు. మృతుడి కుమారుడు పార్థసారథుడు ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా దాడిలో వ్యక్తి మరణించాడా లేక గుండెపోటుతో మరణించాడన్నది పోస్టుమార్టంలో తేలనున్నదని ఎస్‌ఐ తెలిపారు.

### పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న సూపర్‌వైజర్ సుశీలమ్మ

చాగలమర్రి: పౌష్టికాహారం తీసుకుంటేనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీలమ్మ అన్నారు. జాతీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక అజీం బ్రిల్లియంట్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భోజనంలో ఆకుకూరలు, కూరగాయలు, పాలు, పండ్లు, గుడ్లు తప్పకుండా తీసుకోవాలన్నారు. అనంతరం బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు అనే అంశంపై వ్యాస రచన పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గౌసులాజం, అంగన్‌వాడీ కార్యకర్తలు చంద్రకళ, ఇందుమతి, హసీనా, వహిదా తదితరులు పాల్గొన్నారు.

### ఆర్‌పీఐ జిల్లా అధ్యక్షుడిగా లింగస్వామి



మాట్లాడుతున్న లింగస్వామి

నంద్యాల(రూరల్) రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా మేకల లింగస్వామిని ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ సుకుమార్ ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గురువారం స్థానిక పట్టణంలోని నిశాంతి భవనంలో పార్టీ జిల్లా కమిటీని, రాష్ట్ర కార్యవర్గ సభ్యులను నూతనంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సుకుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో ఉన్న రిపబ్లిక్ పార్టీఆఫ్ ఇండియా పార్టీని అన్ని నియోజకవర్గాలలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లా అధ్యక్షుడు లింగస్వామి మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల ప్రజలు రాజకీయంగా ఎదుగుటకు మంచి అవకాశం అన్నారు. త్వరలో అన్ని నియోజక వర్గాలలో పార్టీ తరుపున ఇన్‌చార్జ్‌లను నియమిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాయలసీమ కన్వీనర్ ధర్మరాజు, ఉమ్మడి జిల్లాల కార్యదర్శి శ్యామ్, పార్టీనాయకులు విజయ రాజు, మాదవరం, ఏసురత్నం, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల్లో 'సంక్షేమం'!

- అధ్వానంగా సంక్షేమ హాస్టళ్లు
- సరైన వసతులు లేక విద్యార్థుల అవస్థలు
- పట్టనట్టు వ్యవహరిస్తున్న ప్రభుత్వ



నిరుపయోగంగా దేవనగర్ బీసీ సంక్షేమ వసతి గృహం

నంద్యాల(అర్బన్)/: సంక్షేమ వసతి గృహాలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. పాలకుల నిర్లక్ష్యంతో కనీస నిర్వహణకు నోచుకోవడం లేదు. దీంతో వాటిల్లో చదువుకుంటున్న బడుగు,బలహీన వర్గాల పిల్లలు అవస్థలు పడుతున్నారు.

నంద్యాల నియోజకవర్గంలో 9, ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 5 సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. అయితే, అందులో పలు వాటిల్లో సరైన సదుపాయాలు లేవు. కొన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. క్షేత్ర స్థాయి పరిశీలన చేసి సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాల్సిన అధికారుల సైతం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో ఒకప్పుడు విద్యార్థులతో కళకళలాడిన వసతి గృహాలు నేడు అరకొర మందితో నెట్టుకొస్తున్నాయి.

- పట్టణంలోని దేవనగర్ బీసీ వసతి గృహం 1980లో ప్రారంభమైంది. అప్పట్లో 450మంది విద్యార్థులతో కళకళలాడిన ఈ వసతి గృహం శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం అద్దె భవనంలో ఈ హాస్టల్‌ను నిర్వహిస్తున్నారు. ఇక్కడ సరైన సదుపాయాలు లేవు. దీంతో విద్యార్థుల సంఖ్య కూడా భారీగా తగ్గింది. 45మంది విద్యార్థులే ఉన్నారు. మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకోవడంతో అత్యవసరాల తీర్చుకునేందుకు విద్యార్థులు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది.
- నంద్యాలలోని ఎస్సీ సంక్షేమ హాస్టల్‌లో 100మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ అవసరం మేరకు గదులు లేవు. దీంతో ఇరుకు గదుల్లోనే విద్యార్థులు చదువుకుంటునానరు. మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడంతో చాలా ఇబ్బందిగా ఉందని విద్యార్థులు చెబుతున్నారు.



జూనియర్ కళాశాల వసతి గృహంలో భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం

- పట్టణంలోని బాలికల కళాశాల హాస్టళ్లలో విద్యార్థినులకు సరైన భోజన వసతులు కల్పించక పోవడంతో అర్ధాకలితో ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల హాస్టళ్లను పరిశీలించిన కలెక్టర్ బాలికల హాస్టల్ 1, 2 వార్డెన్‌లకు మెమోలు ఇచ్చారు.
- ఎస్టీ బాలికల వసతి గృహంలో సైతం కనీస సౌకర్యాలు లేవు. ఐదుగదుల్లో నాలుగు గదులు చిన్నపాటి వర్షానికే కారుతున్నాయి. దీంతో ఒకే గదిలో విద్యార్థులు సర్దు కోవాల్సి వస్తుంది. బట్టలను శుభ్రం చేసుకోవడానికి స్థలం లేకపోవడంతో ఆరుబయటే దుస్తులను శుభ్రం చేసుకోవాల్సి వస్తుంది.
- బొమ్మలసత్రం వద్ద ఉన్న సమీకృత బాలికల వసతి గృహం శిథిలావస్థకు చేరింది. ఈ భవనం ఫ్లోరింగ్ కుంగిపోవడం, గదులు కారుతుండటంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 470 మంది విద్యార్థులు ఉన్న ఈ వసతి గృహంలో వసతుల కల్పనకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.



ప్రహరీ గోడ లేని ఎర్రగుంట్ల సంక్షేమ వసతి గృహం

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉన్న జూనియర్, డిగ్రీ కళాశాల సంక్షేమ వసతి గృహాల్లో పరిశుభ్రత పడకేసింది. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. భోజనాల వడ్డింపుల్లో నాణ్యత లేకపోవడంతో విద్యార్థులు అనారోగ్యాల పాలవుతున్నారు. ఎస్టీ జూనియర్ కళాశాల సంక్షేమ వసతి గృహంలో బాత్‌రూములు, మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఆరుబయటనే స్నానాలు, కాలకృత్యాలు తీర్చుకోవాల్సి వస్తుంది.
- ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ఎర్రగుంట్ల గ్రామం సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో 100మంది విద్యార్థులు ఉన్నారు. ఈ హాస్టల్‌కు కాంపౌండ్ వాల్ లేకపోవడంతో పాములు, విషపురుగుల సంచారం అధికమైంది. దీంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

### ఉయ్యాలవాడలో అదే పరిస్థితి



ఉయ్యాలవాడ ఎస్సీ బాలుర వసతి గృహంలో తలుపులు లేని బాత్‌రూములు, మరుగుదొడ్లు

ఉయ్యాలవాడ: మండలకేంద్రం ఉయ్యాలవాడలో ఎస్సీ, బీసీ హాస్టళ్లు ఉన్నాయి. ఈ రెండింటిలో సరైన సౌకర్యాలు లేవు. ఎస్సీ బాలుర వసతి గృహంలో 88 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇక్కడ మరుగుదొడ్లకు తలుపులు లేవు. ఎప్పుడూ దుర్వాసన వెదజల్లుతుంటోంది. మరుగుదొడ్లు సరిగా లేక పోవడంతో బహిర్భూమికి విద్యార్థులు బయటకు వెళ్లవలసి వస్తోంది. స్నానపు గదులకు కూడా తలుపులు లేకపోవడంతో ఆరుబయటే సామూహికంగా విద్యార్థులు స్నానాలు చేస్తున్నారు. బీసీ బాలుర వసతి గృహంలో 95 మంది విద్యార్థులు ఉన్నారు. సరిపడినన్ని గదులు లేక రాత్రి వేళల్లో నిద్రకు ఉపక్రమించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఆరుబయట పడుకుంటే దోమల బెడద. గదుల కిటికీలకు నెట్ లేకపోవడంతో పిల్లలను దోమలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి వసతి గృహాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

### అర్హులకే గోకులాలు

ఉయ్యాలవాడ: అర్హులైన చిన్న, సన్నకారు రైతులకు మాత్రమే ప్రభుత్వం కేటాయించిన గోకులాల షెడ్లు మంజూరు చేస్తున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పశు వైద్యాధికారులు రవీంద్రనాథ్‌రెడ్డి, నాగశైలజ, ఉపాధి హామీ ఏపీఓ రవిప్రకాష్, హౌసింగ్ ఏఈ నరసింహారావుతో గురువారం సమీక్ష నిర్వహించారు. మండలానికి 25 యూనిట్లు మంజూరయ్యాయని షెడ్ల ఏర్పాటు కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిన పెంపకందారులు 5 ఎకరాల్లోపు మెట్ట భూములు కలిగిన వారు మాత్రమే దరఖాస్తులకు అర్హులన్నారు. పూర్తి వివరాలకు సమీంలోని పశు వైద్యశాల, రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు.

### హెచ్‌ఐవీపై అవగాహన సదస్సు

ఉయ్యాలవాడ: స్థానిక మోడల్ స్కూల్‌లో చైతన్య రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు హెచ్‌ఐవీపై అవగాహన సదస్సు నిర్వహించారు. కౌమార దశలో ఉన్న విద్యార్థులకు హెచ్‌వీఐపై అవగాహన అవసరమని ఆరోగ్య సిబ్బంది వివరించారు. హెచ్‌ఐవీ వ్యాధి నిర్ధారణ అయితే ఎఆర్‌టీ సెంటర్‌లో ఉచితంగా మందులు తీసుకుని జీవితకాలాన్ని పెంచుకోవచ్చున్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ దస్తగిరి, హెల్త్ సూపర్‌వైజర్ రామచంద్రుడు, ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ వర్ధనాచారి, తదితరులు పాల్గొన్నారు.

### పంటల నమోదు తప్పనిసరి

శిరివెళ్ల: రైతులు సాగు చేసే పంటలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఏఓ సుధాకర్ గురువారం ఓ ప్రకటనలో సూచించారు. ఈ నెల 12వ తేదీ నాటికి మండలంలో 17,200 ఎకరాల్లో పంటల నమోదు పూర్తయిందని, మిగిలిన రైతులు పంటల నమోదు, ఈకేవైసీ చేయించుకునేందుకు ఈనెల 15వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు.

## వీబీఆర్‌కు 10,300 క్యూసెక్కుల ఇన్ ఫ్లో

వెలుగోడు: బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింకు ఛానల్ ద్వారా వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి 10300 క్యూసెక్కుల జలాలు వచ్చి చేరుతున్నట్లు తెలుగుగంగ ఏఈ శివనాయక్ తెలిపారు. తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి గాలేరు నదికి 5 వేల క్యూసెక్కులు, మద్రాస్ కాలువకు 5 వేల క్యూసెక్కులు, వన్ ఆర్ తూముకు 50 క్యూసెక్కులు, వన్ ఎల్ తూముకు 30 క్యూసెక్కులు నీటిని దిగువకు పంపుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వీబీఆర్‌లో గురువారం 14.655 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ చెప్పారు.

## సీతారాం ఏచూరి మృతి తీరనిలోటు

నంద్యాల(న్యూటౌన్): సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు సీతారాం మృతికి సంతాపం తెలిపారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, సీఐటీయూ కార్యదర్శి ఏసురత్నం, శ్రీనివాసమూర్తి, తోటమద్దులు, బాల వెంకట్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

**ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..**

సీతారాం ఏచూరి అకాల మరణం బడుగు, బలహీన వర్గాలకు తీరని లోటని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండువీరయ్య మాదిగ అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి బడుగు బలహీన విద్యార్థుల కోసం అలుపెరగని పోరాటం చేసిన వ్యక్తి అన్నారు.




మాట్లాడుతున్న దండువీరయ్య మాదిగ

## ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఈఓపీఆర్‌డీ తాహీర్ హుసేన్

చాగలమర్రి: మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపడుతున్నామని ఇన్‌చార్జ్ ఈఓ, ఈఓపీఆర్‌డీ తాహీర్ హుసేన్ తెలిపారు. గురువారం పంచాయతీ సమావేశ భవనంలో గ్రామ సర్పంచ్ పెద్దయ్యగారి తులసమ్మ అధ్యక్షతన పంచాయతీ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మేజర్ గ్రామ పంచాయతీకి 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.40.00 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులను 50 శాతం ఇప్పటి వరకు పూర్తి చేసిన అభివృద్ధి పనులకు, 50 శాతం నిధులు గ్రామంలో పారిశుద్ధ్యం, తాగు నీటి సరఫరాకు వెచ్చించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ మహమ్మద్ సోహెల్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యం మెరుగు

శిరివెళ్ల: పౌష్టికాహారంతోనే ఆరోగ్యం మెరుగు పడుతుందని సీడీపీఓ తేజస్విని అన్నారు. గురువారం బోయలకుంట్లలో అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 1వ తేదీ నుంచి 30 వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో వారోత్సవాలు జరుగుతాయన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మంచి ఆరోగ్యం కోసం కేంద్రాలలో పాలు, గుడ్లు, ఆహారం అందిస్తున్నామన్నారు. వారోత్సవాల్లో భాగంగా ఆకు కూరలు, కూరగాయలు, చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలను ప్రదర్శిస్తున్నామన్నారు. తమ సిబ్బంది అందించే పౌష్టికాహారంతో పాటు ఆరోగ్య కార్యకర్తల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్, రషీదా బేగం, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరిస్తున్న సీడీపీఓ తేజస్విని

### గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

రుద్రవరం: కూటమి ప్రభుత్వం గిరిజనుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని సీపీఎం నాయకులు రామచంద్రుడు కోరారు. కోటకొండ గ్రామ పంచాయతీ మజరా చిన్నయ్యస్వామి చెంచు గూడెంను గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు పంపిణీ చేసిన వ్యవసాయ భూముల్లో బోర్లు వేయించాలని కోరారు. కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు మంజూరు చేయాలని, అలాగే వారి జీవనోపాధిమెరుగు పడేందుకు అడవి నుంచి తేనె, జిగురు, కుంకుడు కాయలు వంటి అటవీ ఉత్పత్తులు తెచ్చుకునేందుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. అనంతరం ఆ శాఖ కార్యదర్శిగా గూడెం వాసి హనుమంతు, సహాయ కార్యదర్శిగా బత్తుల శ్రీనివాసులుతో పాటు 18 మందితో పార్టీ శాఖను ఎన్నుకున్నట్లు తెలిపారు.

### స్వచ్ఛతాహీ సేవను విజయవంతం చేద్దాం

రుద్రవరం: ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీఓ మధుసూదనరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన పంచాయతీ కార్యదర్శులు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛతా భాగిదారి, సంపూర్ణ స్వచ్ఛతా, సఫాయిమిత్ర సురక్ష తదితర కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందని, ఈ మేరకు అంశాల వారీగా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

### వరిలో జింక్ లోపం లేకుండా చూసుకోవాలి

మహానంది: వరి పంటలో జింకు లోపించకుండా చూసుకోవాలని, ఎకరాకు ఇరవై కిలోల ముడి జింక్ ఆఖరి దమ్ములో వేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సరళమ్మ సూచించారు. ఆమె గురువారం నందిపల్లెలో వరి పంటపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మహానంది మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏడీఏ సరళమ్మ మాట్లాడుతూ.. వరిపంటలో జీవన ఎరువుల ప్రాధాన్యత ఎంతో ఉందన్నారు. సమగ్ర సస్యరక్షణ, సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ముడి జింకును భాస్వరం ఎరువులతో కలిపి వాడొద్దని సూచించారు. వరి పంటలో నీటి యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ పద్ధతుల గురించి వివరించారు. ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్త బాలునాయక్, ఏడీఏ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈఓ శ్రీనివాసరెడ్డి, గ్రామ వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

# పైరుకు 'రక్షణ' బాట



వరి పైరులో కాలి బాటలు తీసిన దృశ్యం

- వరిలో కాలిబాటలతో ఎన్నో ప్రయోజనాలు
- ఎరువులు, పురుగు మందుల పిచికారీకి అనుకూలం
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గోస్పాడు: వరి సాగు చేసే రైతులు పొలంలో కాలి బాటలు తీసుకుంటే ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చు. విత్తనాలు వేసినా, నారుతో నాట్లు వేసినా వరి మడిలో తప్పనిసరిగా కాలి బాటలు తీయడం మరువవద్దు. కాలిబాటలు ఏర్పాటును అదనపు ఖర్చుగా భావించి నిర్లక్ష్యం చేస్తే నష్టపోవాల్సి వస్తుంది. కాలిబాటల ప్రయోజనాన్ని వివరిస్తూ, పంట సాగులో ఎన్నో రకాల పరిష్కారం చూపేందుకు కాలి బాటలు దోహదపడుతుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. వరి దుబ్బలను ఆశించి పైరుకు నష్టం కలిగించే బూడిద రంగు దోమ, తెల్లదోమ, ఇతర క్రిమికీటకాలను సకాలంలో చర్యలు చేపట్టేందుకు కాలి బాటలు ఉపయుక్తంగా ఉంటాయి. వీటి వల్ల పొలం నుంచి మురుగు నీటిని తొలగించడం, సులభంగా ఉంటుంది. వరినాట్లు పూర్తయిన తరువాత వరిమళ్లలో ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల వెడల్పున తూర్పు, పడమర దిక్కులో కాలిబాటలు వేయాలి. నాట్లు వేసిన 12 నుంచి 16 రోజుల్లో వీటిని తీయడం మంచిది.

**కాలిబాటలు ఇలా వేయాలి..**

వరినాట్లు వేసేటప్పుడు కాలిబాటలు వేయాలంటే ముందుగానే రెండు గట్ల మధ్య తాళ్లు లాగి ఆ ప్రదేశాన్ని వదిలేసి వరినాట్లను నాటుకోవాలి. విత్తనాలను పొలంలో వేసే పద్ధతిని పాటించిన రైతులు కూడా కాలిబాటలను తీసుకోవచ్చు. వరి పైరు ఎదుగుతున్న సమయంలో మొక్కలను తొలగించి పక్కనే నాటుకోవడం ద్వారా బాటలు తీయవచ్చు. ప్రతి 2 మీటర్లకు 20 సెంటీమీటర్ల వెడల్పుతో మొక్కలను తొలగించాలి. దీంతో కాలిబాటలు ఏర్పడతాయి. మండలంలో ఖరీఫ్ సీజన్ కు గాను అధికంగా వరి పంటను సాగు చేశారు. ఈ ఏడాది మొత్తం దాదాపుగా పదివేల హెక్టార్లు సాగవుతుందని వ్యవసాయాధికారి చెబుతున్నారు.

**లాభాలు ఇలా..**

- వరిలో కాలిబాటలు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు చాలా మేలు జరగనుంది. వరి సాగు చేసిన రైతులు తూర్పు, పడమర దిశగా ప్రతి రెండు మీటర్లకు ఒక కాలిబాటను ఏర్పాటు చేసుకోవాలి.
- మొక్కలకు గాలి, వెలుతురు బాగా అంది చీడపీడలు రాకుండా ఉంటాయి.
- కిరణ జన్య సంయోగ క్రియ బాగా జరుగుతుంది. మొక్కలకు పత్ర హరితం అధికంగా ఉత్పత్తి అవుతుంది.
- పైరుకు ఎంత నీరు అవసరమో అంత మేరకే అందిస్తాయి. సాగు నేలలోని సేంద్రియ పదార్థాలు త్వరగా కుళ్లడానికి తోడ్పడుతాయి. మొక్కలకు పోషకాలను అందిస్తాయి.
- గాలి మొక్కలకు సమృద్ధిగా తగలడంతో పాటు కావలసినంత ఆక్సిజన్‌ను పొందేందుకు వీలుంటుంది.
- పురుగు నివారణ మందులు పిచికారీ చేసుకునేందుకు సులభంగా ఉంటుంది. ప్రతి మొక్కపైన మందు సులభంగా పడేందుకు వీలు ఉంటుంది. ఒక పక్క ఎక్కువ మరో పక్క తక్కువగా మందు పిచికారీ అయ్యే ప్రమాదం ఉండదు.
- కలుపుల నివారణకు, మందుల పిచికారీకి, ఎరువులను సులభంగా చల్లుకునేందుకు, సమాన స్థాయిలో వేసేందుకు చాలా అనుకూలంగా ఉంటుంది.
- వరిమడిలో భూమి తడి లేకుండా సులభంగా ఆరబెట్టేందుకు వీలవుతుంది.
- రైతులు పైరులో ఉండే లోపాలను తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది.
- పైరు ఆరోగ్యవంతంగా పెరగడంతో పాటు అధిక దిగుబడులు పొందేందుకు అనుకూలంగా ఉంటుంది.
- వరికోత సమయంలో సులభంగా కోతలు కోసుకునేందుకు వీలుంటుంది.

### దిగుబడులకు మంచి అవకాశం



వరి పొలంలో కాలిబాటలు చేయడం వల్ల వరిపై ఎక్కువగా గాలి ప్రవేశించి దుబ్బలకు అధిక ఆక్సిజన్ అందుతుంది. దీంతో మొక్కల్లో కిరణ జన్య సంయోగక్రియ బాగా జరిగి మొక్కలు పచ్చదనంతో నిండి మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. అలాగే వరిలో ఎక్కువ దుబ్బలు కట్టడానికి అవకాశం ఉంది. చీడపీడలు ఆశించగానే కాలిబాటలు ఉంటే సులభంగా మందులను పిచికారీ చేసుకోవచ్చు.

– స్వప్నికారెడ్డి, వ్యవసాయాధికారిణి, గోస్పాడు

### 'స్వచ్ఛత'కు చెత్తబుట్టలు



చెత్త సేకరణలో భాగంగా ఇంటింటికీ పంపిణీ చేసేందుకు అధికారులు చెత్తబుట్టలను సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన చెత్త బుట్టలు గురువారం మండల పరిషత్ కార్యాలయానికి చేరాయి. మండలంలోని 20 గ్రామ పంచాయతీలకు సంబంధించి 11,812 చెత్త బుట్టలు వచ్చాయని వీటిని ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు త్వరలో అందజేయనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు. – ఉయ్యాలవాడ

### అయ్యో గణేశా..



ప్రస్తుతం ఎక్కడ చూసిన కాలువలు, నదులు ఉప్పొంగి ప్రవహిస్తుంటే దొర్నిపాడులో మాత్రం కేసీ కాల్వ నీటి ప్రవాహం తగ్గిపోయింది. దీంతో ఐదు రోజుల క్రితం దొర్నిపాడు శివారులోని కేసీలో వినాయక విగ్రహాలు నిమజ్జనం చేశారు. కానీ నీరు లేక పోవడంతో విగ్రహాలు అలాగే తేలియాడుతున్నాయి. దీంతో చూసే వారు అయ్యో గణేశా అంటూ బాధతో వెళ్తున్నారు. – దొర్నిపాడు